క్లుప్తంగా

పవిత్ర హృదయంతో ప్రార్థించాలి

రెంటచింతల: పవిత్ర హృదయంతో ప్రార్థించినవారు కరుణమయురాలైన కానుకమాత తల్లి చల్లని ఆశీస్సులు పొందుతారని రాయవరం విచారణ గురువులు రెవ.ఫాదర్ కొమ్మారెడ్డి సందీప్ అన్నారు. కానుకమాత చర్చి 173వ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆనందపేట కాలనీలో ఏర్పాటు చేసిన నవదిన ప్రార్థనలలో భాగంగా నిర్వహించిన పవిత్ర సమష్టి దివ్య పూజాబలిలో ఫాదర్ సందీప్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులను, ఇరుగుపొరుగు వారిని ప్రేమించిన వారు మరియతల్లి దీవెనలతో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఈ సమష్టి దివ్య పూజాబలిలో సహాయ గురువులు ఫాదర్ పి.స్లీవారెడ్డి(ఎస్ఎహెచ్ఎస్), మఠకన్యలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మహాన్నదానం

గురజాల : అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య అన్నారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత భావన ఋషి శాంతి కల్యాణంను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం గ్రామంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మశాలీయులు, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కావూరి అంజిబాబు, జె నాగేశ్వరరావు, పద్మశాలీయుల సంఘం పెద్దలు జంజనం తిరుపతిరావు, శిరసాల శివ గోవిందరావు, కాకుమాను శ్రీనివాసరావు, దుర్గి రమేష్, శిరసాల వీరాంజనేయులు,వేశాల శివయ్య, గోలి సైదులు తదితరులున్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

ఎస్ఐ అనంత కృష్ణ

గురజాల : రహదారి ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎస్ఐ బి అనంత కృష్ణ సూచించారు. పట్టణంలో బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వాహనదారులకు, ప్రయాణీకులకు ఆదివారం అవగాహన కల్పించారు. వాహన చోదకులు తీసుకోవాల్సి జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌పై అవగాహన వంటి కార్యక్రమాలపై అవగాహన కలిగివుండాలన్నారు.

నేడు గంగిరెడ్డిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

మాచవరం: మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సీహెచ్.సింగరయ్య తెలిపారు. కార్యక్రమంలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. కావున మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్ మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


గిరిజనుల అభ్యున్నతికి సేవాలాల్ కృషి



యడ్లపాడు: గిరిజనుల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి. శ్రీనునాయక్ పేర్కొన్నారు. యడ్లపాడు సుగాలీ కాలనీలోని మేరమ్మ ఆలయంలో ఆదివారం సంత్ సేవాలాల్ 284వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుగాలీల ఆరాధ్యదైవమైన సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న బోయపాలెం ఎస్టీకాలనీలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కుంభ నాగేశ్వరరావు, యడ్లపాడు మండల అధ్యక్షుడు వి. శ్రీనివాస్‌నాయక్, చిలకలూరిపేట పట్టణ గౌరవ అధ్యక్షుడు బి. చిన్నానాయక్, సహాయ కార్యదర్శి దేవర డేవిడ్, నాయకులు ఆర్. శంకర్‌నాయక్, ఆర్. కన్నయ్యనాయక్, ఆర్. శివ నాయక్, యం. శంకర్ నాయక్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో గ్రామ స్వరాజ్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని, అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా గ్రామ స్వరాజ్యానికి బాటలు వేస్తోందని సంక్షేమ పథకాలతో పాటు ఇతర పౌర సేవలన్నీ మీ ముంగిట్లోనే అందే విధంగా చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రజలకు వివరించారు. మండలంలోని చింతపల్లిలో మూడవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ముందుగా జనార్ధనస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేకూర్చిన లబ్దిని వివరించి సంక్షేమ కరదీపికలను అందించారు. అందుతున్న సంక్షేమంపై వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. పడమర బజారు, బీసీ ఏరియాలలో ఎమ్మెల్యే పీఆర్కే పర్యటించారు. మీ అందరి సంక్షేమం అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సంక్షేమ పథకాలు ఇళ్లకు ఎటూ చేరుతున్నాయి. ఇకపై మీ గడప వద్దకే వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుతాయన్నారు. అలాగే పశువైద్య సేవలు కూడా లభ్యం అవుతాయని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను గ్రామ సచివాలయాలు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలోనే ప్రజలకు అవసరమైన అన్ని పౌర సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యాభివృద్ధే కుటుంబ అభివృద్ధిగా భావించి ఎవరికి కూడా విద్య భారం కాకుండా ప్రభుత్వం అందిస్తున్న పథకాల పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. మూడవ రోజు ప్రజలు తరగని ఆదరణ చూపారు. సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎఓ యలమందారెడ్డి, గ్రామ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు, ఎంపీటీసీ వేంపోగు నిర్మలఅచ్యుతరావు, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, మాజీ సర్పంచ్ పంగులూరి హైమావతి రామకృష్ణయ్య, ఉన్నం ఆదిశేషగిరిరావు, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, గమిడి మల్లిఖార్జునరావు, ఉన్నం శివయ్య, శంకర్, గంటా వీరయ్య, కొటారి శివరామకృష్ణ,కర్నాటి సత్యనారాయణ, కర్నాటి శివప్రసాద్, చిరుమామిళ్ల శేఖర్, మాగంటి అంకారావు,పంగులూరి కోటయ్య, ఉమ్మినేని శివరామకృష్ణ, వసంత సాంబశివరావు, కొండ, చిరుమామిళ్ల సరసింహారావు, గుండ్లకుంట రామారావు, మండల, కారెంపూడి పట్టణ పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, ఆలయ కమిటీ చైర్మన్ అలుగునూరి అమరయ్య, సూరె చెంచారావు, లంకా నాగేశ్వరరావు, సూరె వెంకటేశ్వర్లు, మోషెయ్య, వెంకయ్య, ఇర్మియా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక



పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్నీ వర్గాలకు చేకూర్చుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వందలాది మంది వైఎస్సార్ సీపీలో చేరడం అభినందనీయమని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో వెల్దుర్తి మండలంలోని మిట్టమీది పల్లెకు చెందిన 28 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. మిట్టమీది పల్లె సర్పంచ్ అంబటి అంకిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గురుబ్రహ్మం, మండల వైఎస్సార్ సీపీ నాయకులు డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జే జేలు పలుకుతూ 28 కుటుంబాలు ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో పార్టీలో చేరారు. మిట్టమీది పల్లెకు చెందిన టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరిన వల్లెపు నాగయ్య, తమ్మిశెట్టి పిచ్చయ్య, వేముల నాగయ్య, తమ్మిశెట్టి మారుతిరావు, చిన్నహనుమయ్య, చిన్న సత్యం, ఉప్పుతోళ్ళ ఆదినారాయణ, ఆంజనేయులు, మార్కు, సువర్ణ రాజు, బత్తుల పవన్, తమ్మిశెట్టి పవన్, ఏడుకొండలు, శ్రీను, చల్లా వెంకటేశ్వర్లు, వెంకట నారాయణ, పల్లా ప్రేమ్‌కుమార్, వల్లెపు కృపారావు, ఓర్సు వెంకటనారాయణ, మహంకాళి లక్ష్మీనారాయణ, ఉప్పుతోళ్ళ సుధాకర్, గడిగంట్ల నాగాంజి, పెద్ద అంజి, మల్లిఖార్జునరావు, నాగరాజులతో పాటు మరో 10 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికీ ప్రభుత్వ విప్ పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

మాచర్ల: ప్రతి వర్గాన్ని ఆదుకున్న మహనీయుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలో నడుస్తూ ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కలిగిస్తూ ముందుకెళ్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అన్నీ వర్గాలు జేజేలు పలుకుతున్నాయని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలోని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఐదు కుటుంబాలు ప్రభుత్వ విప్ పీఆర్కే ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గ్రామానికి చెందిన వజ్రాల మల్లయ్య ఆధ్వర్యంలో మరో ఐదు కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి పీఆర్కే కండువాలు కప్పి ఆహ్వానించి అభినందించారు.

ముటుకూరు గ్రామంలో తీవ్ర విషాదం



ఉప్పుతోళ్ళ చంద్రశేఖర్



జిల్లెలమూడి వెంకటరమణ

దుర్గి: చిన్న పాటి నిర్లక్ష్యం .. సరైన శిక్షణ లేని డ్రైవర్.. వల్ల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పలు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. గత మూడు రోజుల క్రితం వెల్దుర్తి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు. మిగిలిన 8 మంది బాధితులు తీవ్ర గాయాలపాలై నర్సరావుపేట జీబీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పెళ్లి శుభకార్యానికి బయలుదేరిన ఆ కుటుంబం పై రోడ్డు ప్రమాదం రూపంలో ఆ కుటుంబాలను చిన్నాభిన్నం చేశాయి. ముటుకూరు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపిన ఘోర రోడ్డు ప్రమాద కుటుంబాలు వేదన వర్ణనాతీతంగా ఉంది. వరుడు జిల్లెలమూడి వీరబాబు ప్రమాదంలో నడుము, రెండు కాళ్లు నుజ్జు కావడంతో మంచానికే పరిమితం కానున్నారు. శనివారం రాత్రి వారి ఇరువురికి సర్జరీ చేసినట్లు బంధువులు తెలిపారు. పలువురు ప్రాణాపాయా స్థితి నుంచి రాకపోవడం దురదృష్టకరం. మృతులు, చిన్నారులు లింగ జశ్విత, గోనుగుంట్ల హరీష్, ఇరువురు తల్లులు చికిత్స పొందుతూ తమ బిడ్డల కడసారి చూపుకు నోచుకోకపోవడం పలువురిని కలచివేసింది. చిరు ఉద్యోగాలతో కుటుంబాలను పోషించుకుంటూ అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పిల్లలను రోడ్డు ప్రమాదంలో మృత్యువు వారి జీవితంలో చీకటి నింపింది. పలువురు క్షతగాత్రుల పరిస్థితిని ఇప్పటికీ చెప్పలేమని రెండు రోజుల తర్వాత వారి కండీషన్ చెప్పగలమని వైద్యులు తెలిపినట్లు బంధువులు, మిత్రులు తెలిపారు.

ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా ఏపీ) డైరీ, క్యాలెండర్లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబు సుభాని, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మొహిద్దీన్ బాష, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ముజీబ్, సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి విరాళం



చెక్‌ను ఈవో సుధాకరరెడ్డికి అందజేస్తున్న దాత అల్లూరి పేరయ్య

నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్సప్పాలెంలో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపానికి హైదరాబాద్‌కు చెందిన అల్లూరి పేరయ్య, సుమతి దంపతులు రూ.65వేల విరాళం అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళం చెక్‌ను ఈవో టి.సుధాకరరెడ్డికి దా త పేరయ్య అందించారు. కల్యాణ మండపంలోని ఏసీ ఏర్పాటుకు చెక్‌ను దాత అందించినట్టు ఈవో తెలిపారు.దేవస్థానానికి అనుబంధంగా అభివృద్ధి చేస్తున్న కల్యాణ మండపంలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు భక్తులు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన పూజలు



వినుకొండ(నూజెండ్ల): శ్రీ వేదమాత అర్చక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో వినుకొండ పాత శివాలయంలో ఆదివారం సప్తమ వార్షిక లక్ష బిల్వార్చన, అమ్మవారి లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అర్చకులు, పురోహితులు కుటుంబ సమేతంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలపర్తి సుబ్బయ్య, యడవల్లి శ్రీనివాసరావు, అరిపిరాల శివ, జె.రాంబాబు, తెలికేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు



ప్రిన్సిపల్ బాలకృష్ణను సన్మానిస్తున్న సాంఘీక సంక్షేమ గురుకులాల అధికారులు

విజయపురిసౌత్: అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తోందని సాంఘీక సంక్షేమ గురుకులాల సంస్థ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ శాంతి విశాల అన్నారు. ఆదివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ డి బాలకృష్ణ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపల్ బాలకృష్ణ పనిచేసిన ప్రతి పాఠశాలలో నిబద్దతతో పనిచేసి విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారని ప్రశంసించారు. అనంతరం బాలకృష్ణను శాలువలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా డీసీఓ ఎం బాలాజీనాయక్, అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ సంజీవరావు, డిప్యూటీ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ బివి మల్లేశ్వరావు, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరావు, ఉపాధ్యాయినులు, తదదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు



రికార్డులను పరిశీలిస్తున్న డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ శాంతి విశాల

విజయపురిసౌత్: కీ పెర్‌ఫామెన్స్ ఇండికేటర్ ప్రోగ్రాం ద్వారా వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థినీ విద్యార్థుల చదువుపై తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆదివారం విజయపురిసౌత్‌లోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ శాంతివిశాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ గురుకులాల సంస్థ అధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలలోని 21 గురుకుల పాఠశాలలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి 17 గురుకుల పాఠశాలలో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మరో 4 పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. దీంతో పాఠశాలల్లో కిచెన్ గార్డెన్, అల్యూమిని, ఎన్‌సీసీ, ప్రిన్సిపల్ నివాసంలో ఉంటున్నారా లేదా, రాత్రివేళల్లో సెక్యూరిటీ విధులపై సమాచారం సేకరణ జరుగుతుందన్నారు. దీని ద్వారా రాబోయే విద్యా సంవత్సరంలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్త వహించేందుకు తోడ్పడుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయుల బోధనా విధానాలపై రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట ప్రిన్సిపల్ డి బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీరాజ్యం, ఉపాధ్యాయునులు దార మేరి మంజుల, పుష్పలీల, షఫీ, సరళ, జయశ్రీ, అరుణ, తదితరులు ఉన్నారు.

చిన్నారుల పరుగు పందెం పోటీలకు స్పందన



పోటీలు నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వాసవీ క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో బీసీ కాలనీలోని సరోజినీనాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆదివారం పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అయ్యప్పస్వామి దేవస్థానం కమిటీ గౌరవాధ్యక్షుడు గంధం వెంకట సూర్యనారాయణ మాట్లాడుతూ దేశ సంస్కృతి, వారసత్వాన్ని చిన్నారులకు పాఠశాల విద్య నుంచే అందించాలని తెలిపారు. పోటీల్లో విజేతలకు పాఠశాలలో సోమవారం నిర్వహించనున్న మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు తాడువాయి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు మునగాల చిరంజీవి, రాధిక, వెల్లంపల్లి కేశవరావు, హెచ్ఎం గోవిందనాయక్, నాగమణి పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం కావాలని కోరుతూ ప్రార్థనలు



ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ ఫిలిప్

వినుకొండ(నూజెండ్ల): జగనన్న చేదోడు 3వ విడత ప్రారంభోత్సవం సందర్భంగా వినుకొండ వస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం కావాలని కోరుతూ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్ ఆధ్వర్యంలో స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో సోమవారం వెల్లటూరు రోడ్డులోని ఘాట్ రోడ్డు వద్ద నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ విజయవంతం కావాలని చర్చి పాస్టర్ రెవరెండ్ పత్రా ఫిలిప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు బేతం శ్యాంప్రసాద్, కార్యదర్శి పి.ఫిలిప్, కోశాధికారి కె.కాలేబురాజు, సంఘ పెద్దలు చాట్ల రామయ్య, సురభి జోసెఫ్, పులుగుజ్జు వరప్రసాద్, గద్దల ఆశీవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దుర్గి: రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రేమ్ నగర్ కాలనీకి చెందిన చలంచర్ల ప్రసాద్ (40) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు సంతానం. రెక్కాడితే గాని డొక్కాడని దయనీయ పరిస్థితి. వారి కుటుంబాన్ని స్థానికులు వారి దయనీయ పరిస్థితిని సూచి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జక్క రమేష్‌కు వివరించగా వెంటనే ఆయన స్పందించి మృతుని కుటుంబ పరిస్థితిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి వివరించి, వారి ఆదేశానుసారం ప్రస్తుతం మట్టి ఖర్చులకు రూ. 5వేలు ఆర్థిక సాయం చేశారు.

జాతీయస్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు, రెడ్ల అన్నదాన సత్రం అధ్యక్షులు పులి ఓబుల్‌రెడ్డి

రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఫిబ్రవరి 12 నుంచి 17వ తేదీ వరకు జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి ఎద్దుల బండలాగు ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు, రెడ్ల అన్నదాన సత్రం అధ్యక్షులు పులి ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి మండలపు వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని పాలువాయి జంక్షన్‌లో వేంచేసిన శ్రీ కనకదుర్గమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆశీస్సులతో, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సారధ్యంలో సత్రశాలలో వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంభ సమేత మల్లిఖారునస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న అఖిలభారత రెడ్ల కుల గురువు శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రం మైదానంలో ఈ ఎద్దుల ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. మొత్తం 6 విభాగాలకు గాను ఒక్కొక్క విభాగంలో 7,8 బహుమతులు చొప్పున 41 బహుమతుల ద్వారా రూ.10.17 లక్షలు విజేతలైన రైతు సోదరులకు అందచేయడం జరుగుతుందన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో పెద్ద సంఖ్యలో రైతన్నలు పాల్గొని విజయ వంతం చేయాలని వారు కోరారు. పూర్తి వివరాలకు : 9908775005, 8096154409, 9704005849 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రెడ్ల సత్రం ట్రెజరర్ నెవలి సీతారామిరెడ్డి, పత్తి కోటిరెడ్డి, యర్రెద్దుల శ్రీనివాసరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, పేరం వెంకటరామిరెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి, చపారపు భాస్కర్‌రెడ్డి, గాదె వీరారెడ్డి, సిద్దవటం శివారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, చింతా శివారెడ్డి, తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



సంఘటన స్థలంలో మృతిచెందిన సంగారావు

దాచేపల్లి : ఆగి ఉన్న లారీని ఢీకొట్టి వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. నగర పంచాయతీ పరిధిలోని భవ్య పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై ఉన్న పిడుగురాళ్ల మండలం వీరాపురంకు చెందిన కుర్ర సంగారావు(47) దుర్మారణం చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. వ్యక్తిగత పనుల నిమిత్తం దాచేపల్లికి ద్విచక్రవాహనంపై సంగారావు, మల్లిఖార్జునరావులు వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పెట్రోల్ బంక్ వద్ద ఆగిఉన్న లారీని అతివేగంగా ద్విచక్రవాహనంతో ఢీకొట్టారు. ద్విచక్రవాహనం నడుపుతున్న సంగారావు అక్కడికక్కడే మృతిచెందగా, మల్లిఖార్జునరావు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలంను పోలీసులు పరిశీలించారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షేక్ బిలాలుద్దీన్ తెలిపారు.

పాల ట్యాంకర్ ఢీకొట్టి గుర్తుతెలియని వ్యక్తి మృతి...

పాలట్యాంకర్ ఢీకొట్టి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన భవ్య పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం జరిగింది. సుమారుగా 60 ఏళ్ల వయస్సున్న వ్యక్తి ద్విచక్రవాహనంపై రోడ్డు పక్కన నిలబడ్డాడు. హైదరాబాద్ వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న పాలట్యాంకర్ ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్నాటి గాంధీ నాళం మట్టపల్లి జీవితం ఆదర్శనీయం

మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి



మట్టపల్లి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

రెంటచింతల: స్వాతంత్ర్య సమరయోధుడు పల్నాటి గాంధీ నాళం మట్టపల్లి జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రామాలయం సెంటర్లో నిర్వహించిన నాళం మట్టపల్లి 62వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజీవీ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మట్టపల్లి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జాతిపిత మహాత్మగాంధీని రెంటచింతలకు తీసుకువచ్చి ఈ ప్రాంతంలో మగ్గాల ద్వారా నూలు వడించిన మట్టపల్లి పల్నాటి గాంధీగా పేరు పొందారన్నారు. పల్నాడు ప్రాంతం నుంచి స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో మందిని పాల్గొనేలా మట్టపల్లి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం మట్టపల్లి వర్ధంతి సందర్భంగా 8 మంది పేద విద్యార్థులకు రూ.4 వేల చొప్పున నగదును, 10 మంది వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ముందుగా సెంటర్‌లో ఉన్న మహాత్మగాంధీ, నాళం మట్టపల్లి, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, సొసైటీ చైర్మన్ మోదుగు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మధుబాబు, ఎఎస్ఐ హనుమంతరావు, గుండా వెంకటేశ్వర్లు, యేచూరి వెంకట సైదయ్య, నాళం పెదబాబు, చినబాబు, కృష్ణారావు, జి.నాగాంజనేయులు, ఆర్. బిక్షాలు, ఎ.నర్సింహారావు, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

ఎండుగుంపాలెం చెరువు మరమ్మతులు ప్రారంభం



నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెంలో మంచినీటి చెరువు మరమ్మతులు ఆదివారం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు సూరె సరస్వతి శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో గ్రామంలోని రెండు చెరువుల సమస్యను ప్రస్తావించారు. సాగర్ జలాలతో నింపినా ఉపయోగం లేదని, కలుషితమవుతాయని తెలిపారు. చెరువుల్ని శుభ్రం చేయాలని కోరారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. చెరువు శుభ్రం పనుల్ని ఆదివారం ప్రారంభించారు. నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో శుభ్రం చేయనున్నట్లు చెప్పారు.